# రామీ

స్వామి ఓంకార్

ద మిషన్ ఆఫ్ పీస్
**శ్రీ శాంతి ఆశ్రమము**
**తోటపల్లి కొండలు, వయా శంఖవరం-533 446**
తూ॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్
ఫోన్ : 7382009962
email: srisanthiashram@gmail.com
website : srisantiashram.org.in

## విషయసూచిక

1. రామీ 5

2. బడారామీకి – ఛోటా రామీ ఉత్తరం 8

3. మా రామీల దైవారాధన 14

4. రామీ, నీ ఆశయమేమి? 19

5. మా రామీ జన్మదినము 22

6. బడా – ఛోటా రామీలకు లేఖ 26

7. రామ – రామీ 28



## రామీ

రామీకి నిరాశ గల్గించితినని చింతించుచుంటిని. నీలగిరికి చల్లగాలికై వచ్చు చుందునని తలచెడివారు గూడ కొంతమంది గలరు. ఎచ్చట ఆశ్రమ సేవ చేయవలసి యున్న అచ్చటకు వేసవియైనా, చలికాలమైనను వెళ్ళుచుందును.

రామీని గూడ, మాతో నీలగిరి తీసుకొని వచ్చుట తప్పదనే దాని భక్తి ప్రేమ లను బట్టి మొదట తలచితిని. తర్వాతను రామీ దారిలో అరచుచుండుననియు, ఎవ్వరినైనా కరుచునేమో అని ఈసారి, తోటపల్లిలోనే వదలివేయుట మంచిదని నిశ్చయించి, రామీకి తెలియకుండా రహస్యముగా వచ్చితిమి. మేము సామాను సర్దుకొను చుండ వచ్చేటప్పుడు మూడు నాలుగు రోజులనుండి, మా చుట్టును, సామాను చుట్టును తిరుగుచు, మావైపే దీనముగా జూచుచుండెను. వచ్చే రోజున రామీని దూరముగా కట్టివేస్తిమి. మేము వెళ్ళిపోయిన తర్వాత రామీని విప్పగా అది పరుగెత్తి ఆశ్రమం అంతా కొండవద్దనుండి ముందుగేటువరకు నాలుగు ప్రక్కలా నాకై వెతికి నిరాశజెంది విచారముతో ఆరోజంతయు పరుండెనని, తిండియైనా తినలేదని ఆశ్రమవాసులు వ్రాయగా చదివి విచారించితిని.

రామీకి నాకు యున్న సంబంధమేమి? దూరముగా వుంచుటకు, విడదీయు టకు వీలులేని సంబంధము. యీ క్రింది అనుభవములను మీరు చదివిన, మీరే గ్రహించగలరు. నేను వ్రాసుకొనుచున్నపుడు, అర్థరాత్రియైనను సరే, తెల్లవారు ఝామైనను సరే, మధ్యాహ్నమైనను సరే, నాకుర్చీ క్రిందనే పరుండి యుండును.

నేను లేవగనే అదియులేచును. బడలికగా నుండి, మంచము మీద పరున్నచో రామీ వెంటనే మంచము క్రిందకుచేరి పరుండును. మేడమీద ధ్యానమందిరము లోనికి వెళ్ళిన రామీ అచ్చటకు తయారై నా కాళ్లముందే పరుండును. స్నానమునకు వెళ్ళిన ఒక్కొక్కసారి గదిమూలకు వచ్చి పరుండును. నీళ్ళు దానిమీద పడేలాగున యున్న, గుమ్మము వద్దకువచ్చి, నేను బైటకు వచ్చేవరకు కాచుకొనియుండును. నేను ఫలహారము జేయుచుండ తదేక దృష్టిగా నావైపే జూచుచుండును. రామీ ఆహారముచాల సాత్వికము. అది పాలు రొట్టె గాని, పాలు గోధుమ నూక జావ అన్నముగాని తినుచుండును. పాలు అన్నము రామీకి ఎంతో ప్రీతి. చెవి కోసు కొన్నంత ఆప్యాయముగా త్రాగుచుండునని లోగడ ఇదివరలో వ్రాసినట్లు జ్ఞాపకము.

నేను ఉదయమే బైటకు షికారుగా పనులు జూచుటకు గాని ఒక్కొక్కసారి సూర్యోదయము కానప్పుడు ధ్యానము జేసుకొనుటకు చేతికర్ర తీసుకొనుచుండ రామీ గ్రహించి ముందుగనే నేను వెళ్లేవైపు దారి తీయుచుండును. ఒక్కొక్కసారి,

రామీ ఆశ్రమములోనికి బాలురతో ఉదయమే వెళ్ళి అందరినీ నిద్రనుండి లేపి అందరినీ జూచి వచ్చుచుండును. నేను వ్రాయునది విచిత్రముగా నమ్ముటకు వీలు లేనట్లు తోచవచ్చును. ఎవ్వరైనా బాలుడు సూర్యోదయమైన తర్వాత గూడ ముసుగు పెట్టి నిద్రపోవుచున్న, ఆ దుప్పటి రామీ నోటితో లాగివేసి ఆ బాలుడు లేచేవరకు దుప్పటి పీకుచు, ఆడుకొనుచు లాగును. వూరుకొనదు.

రామీ ఆశ్రమంలోనికి వెళ్లినపుడు నేను, కైలాసగిరికి విశ్వనాథ మందిరంవైపు వెళ్ళుచుండును. ఒక్కొక్కసారి మైత్రేయి ఆశ్రమంకు ధ్యానము చేయుటకు వెళ్ళు చుండును. రామీకి ఎటుల తెలుసునోగాని, నేను ఎచ్చటకు వెళ్ళిన అచ్చటకే భూమిని వాసనజూచుచు నా జాడను పసిగట్టి పరుగు పరుగున గంతులు వేయుచు వచ్చు చుండును. కుక్కలకు యిట్టి అద్భుతశక్తిని భగవంతుడు ప్రసాదించుటచేతనే మన గవర్నమెంటులో రహస్య పరిశోధనశాఖ వారు పోలీసు కుక్కలను బాగా తయారు చేసి హత్యలను, దొంగతనములను వాటిసహాయముతో అత్యద్భుతముగ కనిపెట్ట గలుగుచున్నారు. ఇవి దేశమునకు ప్రస్తుతం ఎంతో మహోపకారము చేయగలుగు చున్నవి.

అట్టి విశ్వాస పాత్రురాలైన రామీని వదలిపెట్టి వచ్చుట మనస్సునకు బాధ గానే యుండి ఇంకెన్నడును అటుల వదలరాదని, రామీకి నిరాశ, చింతను గల్గించ రాదని తలచుచు త్వరగా ఇచ్చటి పనులుపూర్తి కాగానే, రామీవద్దకు వెళ్ళవలెనని నిశ్చయించితిని. మానవునకైనను నమ్మినజంతువునకైననునిరాశ గల్గించకుండుటయే ముఖ్యముగదా! మానవునిలో ఒక దైవము, జంతువులో మరియొక దైవము లేదు గదా! దైవమే సర్వాంతర్యామిగదా! నోరులేని మూగజంతువును మనలను పూర్తిగా నమ్మిన రామీని ప్రేమించినను దైవమును ప్రేమించినట్లే అని నా నమ్మకము.

ఇంతలో నీలగిరి శాంతి కేంద్రములో జిమ్మి అనెడి శునకము 5 పిల్లలను నెలరోజుల క్రింద పెట్టెను. రెండు పిల్లలను ఎవ్వరో దొంగతనముగా తీసుకొని పోయిరి. మానవులు, దైవాకారులై యుండి, దుర్లభమైన మానవజన్మను పొందియు, కుక్కపిల్లలను దొంగతనము జేయువారు గూడ యుండుట విచారకరము.

మరి రెండు కుక్కపిల్లలను దగ్గరలో నున్న ఫాదరీలు అడుగగా, వారికి వాగ్దానము జేస్తిమి. ఇక మిగిలి యున్నది తెల్లని ఒకచిన్న కుక్కపిల్లయే వున్నది. దానిని రామీకి బహుమతిగా తీసుకొని వెళ్ళవలెనని నిశ్చయించితిమి. రామీకి, రామీ ప్రేమకు ఇంతకన్న మరేమీ బహుమతిగా తీసుకొని వెళ్ళుటకు గానవచ్చుటలేదు. ఈ చిన్న కుక్కపిల్లకు నామకరణము చేయమనగా “బేబీ రామీ”



అని పేరు పెట్టితిమి. ఆశ్చర్యములకు ఆశ్చర్యము యీ చిన్న కుక్కపిల్లగూడ నేను వ్రాసుకొనుచుండ నా పాదముల వద్దకు వచ్చుచుండును. నిన్న ఫలహారము జేయుచుండ పాదముల దగ్గరకే వచ్చి పరుండి నిద్రపోవుచుండుట జూచి, ఆశ్చర్యపడితిని. రాత్రి వచ్చి దాని తలను నా పాదముల మీద పెట్టుకుని పరుండగా నాకు ఆనంద బాష్పములు రాలదొడగెను.

ప్రేమయే దైవము దైవమే ప్రేమ

ప్రేమ యున్నచోటనే దైవముండెనుగదా!

రామీ వెయ్యిమైళ్ళ దూరములో నున్నను తరుచు నీలగిరి నుండి గూడ తోటపల్లిలో నున్న రామీకి

రామ రామ యనుమా రామీ

రాముని మరువకుమా రామీ.

అనెడి పాటను నేర్పుచుండును. ఎంత దూరములో నున్నను నా ఉపదేశ వాక్యములను రామీ వినుచున్నట్లే యుండును. దైవకృపచే నిర్హేతుకముగా ఇప్పుడు బేబీ రామీని నాకు ఇవ్వబడెను. గాన ఇప్పుడు నేను జెప్పుచున్న మంత్రమును రెండింటికి గూడ ఒకేసారి చెప్పుచుండుట నాకు ఎంతో పరవశత్వమును గల్గించు చుండును.

నా జీవితము ప్రవృత్తిపరులైన మానవులకు అంతగా తోడ్పడజాలకున్నను, నోరులేని మూగజంతువులకైనను పెద్దరామీకి, చిన్న రామీకి కొంత సహకారిగా నున్నదని తృప్తిని, ఆనందమును పొందుచుండును.

నీలగిరిలో నున్నను రామీకి, నాకును మధ్యను ఎంతదూరమున్నదని ప్రశ్నించు కొనగా, రామీ నన్ను ప్రేమించుచున్నది గాన ఆ దైవ ప్రేమలో దూరమునునది లేదని తలంచుచుండును.

దైవ ప్రేమలో దూరమన్నది లేదు. రామీ నుండి నావద్దకు వున్న దూరమే నావద్దనుండి రామీ వద్దకు వున్నది. ఇది దైవ చట్టముగదా! జంతువులకే గాక మానవులకు కూడ వర్తించెడి దైవ నిర్ణయములు. కరుణామయుడైన సర్వజ్ఞుండైన దైవము పెద్ద రామీని, బేబీ రామీని ఆయురారోగ్యములతో బ్రోచుగాక! ప్రేమశూన్యులైన ప్రవృత్తి పరులైన మానవులకు ఈ మూగ జంతువుల ప్రేమ ఆదర్శనీయముగా నుండి ఆశ్రమవృద్ధికి, దేశశాంతికి లోక కళ్యాణమునకు తోడ్పడుగాక!

మ. మనుజుండై పశువౌటకంటె బశుజన్మంబెచ్చు, నీవెట్లు దా
నిని బుట్టించితి వట్లు చేయునది; హా! నిర్భాగ్యతన్ జ్ఞాన మె
ల్లను వ్యత్యస్తముజేసి, నీ విధుల నుల్లంఘించెదన్ నేను; దం
డన కర్హుండను, బ్రోవవే ననుదయన్; సద్భక్తచింతామణీ.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

**అర్పణ**

**నేనీ వ్యాసము వ్రాయుచుండ బేబీ రామీ నా కుర్చీ క్రిందనే యున్నది. మా శాంతి పాఠకులందరూ దాని ప్రేమను అందుకొని ప్రేమపూరితులుగా నుందురు గాక! ప్రేమ హృదయులందరకూ యీ వ్యాసము ప్రేమతో అర్పణ.**

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

(శాంతి జూలై 1967)

## బడారామీకి - ఛోటా రామీ ఉత్తరం

ప్రియమైన బడారామీ! నమస్కారములు.

ఇచ్చట శ్రీస్వామీజీ మొదలగువారు నీ గురించి ఎన్నో మంచి సంగతులు చెప్పుకొనుటచే, నిన్ను చూచుటకు నా మనస్సు కోరుచున్నది. ప్రప్రథమమున నీకు ఈ ఉత్తరం అరవములో వ్రాయవలెనా! ఇంగ్లీషులో వ్రాయవలెనా! లేక తెలుగులో వ్రాయవలెనా అని ఆలోచించితిని.

నీవు అరవదేశములో నీలగిరిలో పుట్టితివిగాన, నీకు అరవభాష వచ్చియే వుండును. కొంతకాలము యిచ్చట దొరలు దొరసానులవద్ద వుంటివి గాన ఇంగ్లీషు కూడ వచ్చియే వుండును. ఇక నీవు ఆంధ్రదేశములో తెలుగువారి యొద్ద వుంటివి గాన, తెలుగుభాష పూర్తిగా వచ్చియే వుండును. అన్నిటికంటెను మనకు మూగ జంతువులకు ఏ భాషయు అవసరములేదు. ప్రేమయే మనభాష. శ్రీ జ్ఞానేశ్వరమ్మ నీవద్ద నున్నపుడు, నీ నేత్రములద్వారా నీవు మాట్లాడుచుంటివని నీవు వ్రాయించినట్లు ఒక ఉత్తరము శ్రీస్వామీజీకి వ్రాస్తిరి. అందులో శ్రీస్వామీజీ నీతో చెప్పకుండగా, నీకు కనిపించకుండగా, నీలగిరి వచ్చివేసినందులకు చాల బాధపడితివని, ఒకటి



రెండు రోజులు తిండియైనను తినక, నీరు గూడ త్రాగక, చింతించి బెంగతో పరుంటివని వ్రాయగా చదివి, శ్రీ స్వామీజీ చాల బాధపడితిరి.

శ్రీ స్వామీజీ ఎచ్చటకు వెళ్ళినను, నీవు వారికంటె ముందుగనే ప్రయాణమై వెళ్ళికారులో కూర్చొనెడిదానవట వెయ్యిమైళ్ళు రైలు ప్రయాణమనియు, రైలు దగ్గరకు వచ్చుట, మరల రైలునుండి యిచటకు చేరుట దూర ప్రయాణము నీకు మంచిది గాదనియే నిన్ను తోటపల్లిలో వదలిపెట్టి, నీకు కనిపించకుండా వచ్చితిరట. నీకు తెలిసినచో బాధపడుదువనియే శ్రీ స్వామీజీ బయలుదేరునపుడు నిన్ను దూరముగా వేరుస్థలములో నుంచిరని చెప్పుకొనుచుండిరి. ఈ పొరపాటునకు, శ్రీ స్వామీజీ నీ ఆనందమునకై నన్ను నీకు బహుమతిగా అర్పించుటకు తీసుకొని వచ్చుచుండిరి. నేను జిమ్మీ పుత్రుడను, నా వయస్సు మూడునెలలే, మేము ఐదుగురము బిడ్డలము, మేము జన్మించిన నెలలోనే క్రూర హృదయులైన దొంగలు, మాలో యిద్దరిని దొంగతన ముగా తీసుకొని పోయిరి. శ్రీ స్వామీజీ ఎంత ప్రయత్నించినను అవి దొరకలేదు. మరి యిద్దరిని ప్రేమ హృదయులగు భక్తులైన ఫాదరీలు కోరుటచే వారికి యిచ్చితిరి. మా ఐదుగురిలో ఇక నేను మాత్రము మిగిలియుంటిని నన్ను గూడ ఫాదరీలు వారి చెర్చిలో వుండుటకు యివ్వమని కోరిరిగాని, శ్రీ స్వామీజీ నన్ను నీవద్దకు, తోటపల్లి తీసుకొని వెళ్ళెదనని ఎంత మాత్రము వారికి యిచ్చుటకు సమ్మతించలేదు.

ఇచటి ఆశ్రమాధ్యక్షురాలైన శ్రీ లలితాదేవిగారు, నా ప్రయాణములో గాలి తగులుటకై అన్నివైపులా రంధ్రములతో చక్కని పెట్టెను యిచ్చితిరి. నాకు, నీకు వుపయోగించుటకై సబ్బుబిళ్ళలు, మనము ప్రీతిగా తినెడి బిస్కత్తులు వగైరా యిచ్చెదనని, శ్రీ స్వామీజీతో ఆమె చెప్పుచుండుట విని యుంటిని. దైవ మొక్కడే గాన, ఒకటిగానే, అణువు మొదలు బ్రహ్మాండమువరకూ, ఏకమై, నిత్యమై, శాశ్వతమై బరగుచున్నది గాన, మానవులు, మతమును, జీవితమును రెండుగా గాక, ఒకటిగా చూడవలెనని, మన స్వామీజీవలె ఆమెగూడ సదా చెప్పుచుందురు.

అనుభవములేని క్రూరమైన మానవులు కొందరు, ప్రేమశూన్యులై మనము ఎవరికిని హాని చేయకున్నను, మనలను కొట్టుచుందురు. ఇచట "తంబి" యను పిల్లవాడు తోటమాలి మనుమడు వుండెను. వాడు నా మెడను పట్టుకుని నులుము చుండ శ్రీ స్వామీజీకి తెలిసి వానిని మందలించి నన్ను ఇక ఎన్నడూ తాకవలదని భయపెట్టిరి. నీవు ఈ పిల్లవాని స్వభావమును గ్రహించి, యిచ్చుట వున్నపుడు వాడి మీద పడెడిదానవని, వాడు నిన్ను చూచి పారిపోయెడివాడని వింటిని.

శ్రీ లలితాదేవిగారు మొదలగువారు, హిందువులు కొందరు క్రూరముగా యుందురనియు, దొరలు దొరసానులు తదితర జాతులవారికంటె ఎక్కువ ప్రేమగా యుందురని చెప్పుకొనుచుందురు. లలితాదేవి ఆమె మంచముమీదనే మనలను పరుండబెట్టుకొనుచుండునని, ఆమె తోటపల్లి స్వర్ణోత్సవమునకు వచ్చినపుడు ఆమె పరుపుమీదనే పరుండెడిదానవని విని ఆనందించితిని.

ఈ మధ్య లలితాదేవి చాల చింతగా బాధపడుచుండెను. ఏలనన, నీలగిరిలో ఒక క్రూరమైన పంజాబీ కలెక్టరు ఏ కుక్క ఊరిలోనికి వచ్చినను, దానిని క్రూరముగా పట్టించి, కుక్కలన్నింటిని చంపించుచుండెనని విచారించుచుండెను. ఆమె ఆ కలక్టరుని జూచి, అట్టి క్రూరమైన పనులు, కరుణామయుండైన బుద్ధభగవానుడు జన్మించిన హిందూదేశములో, అహింస పరమధర్మమని, గోమాత పూజలు చేయు దేశములో యిట్టిపని జరుగనీయరాదని ఎంత బోధించినను లాభము లేకపోయెనని, ఆమె శ్రీ స్వామీజీతో చెప్పుచు బాధపడుచుండెను.

దొరలు అందరూ ఒకే ప్రేమ హృదయులుగా యుందురని చెప్పుటకు వీలు లేదు. లలితాదేవి మనయందు ఎంతయో ప్రేమగా యున్నను, మరియొక దొరసాని గూడ తెల్లగా యున్నందున ఆమెవంటిదేనని భ్రమపడి ఆమెచెంతకు వెళ్ళి ఆమె కాలు నాకబోవగా, ఆమె జోడుతో నన్ను తన్నెను. అందుచే దొరలలో గూడ క్రూర హృదయులు, ప్రేమశూన్యులు యున్నారనియు, హిందువులలో గూడ ప్రేమ హృద యులు కొందరు లేకపోలేదనియు తెలియుచున్నది.

కొందరు కఠిన హృదయులు, నేనేమియు చేయకున్నను, నన్ను తరచు కొట్టుచు, నన్ను చూడగనే కసరుచుందురు. ఇట్టివారిని గురించియే శ్రీ స్వామీజీ స్వభావమును మార్చుట దుర్లభమని జెప్పుచుందురు. నీ స్వభావము నీది. నా స్వభావము నాదిగదా!

అచ్చట తెల్లని రంగుగల సాత్విక స్వభావమైన పిల్లి గలదనియు, దానితో నీవు ఆడుకొనుచుందువని, మీ యిద్దరూ ఒకే పళ్ళెములోని పాలు, అన్నము తిను చుందురనియు విని ఆనందించితిని. ఇచ్చటగూడ ఒక నల్లని పిల్లి తోటమాలి రామస్వామిది యున్నది. అతని మనుమడు తంబి దానిని హింసించుచుండును. బాలుడైనను అది వాడి క్రూరస్వభావము.

నాలోగూడ కౄరమైన స్వార్థమైన, స్వభావమున్నదని శ్రీ స్వామీజీ చింతించు చుందురు. నేను రొట్టె, బిస్కత్తులు తినుచుండ, చిన్నతనము చేత తెలిసియో, తెలియకయో నాకును, నా తల్లికిని ఏదైనను ఆహారము పెట్టినపుడు నాకు పెట్టినది



వదలిపెట్టి, నా తల్లి జిమ్మీకి పెట్టినది లాగుకొని తినుచుందును. నా తల్లి ఎంత అమాయకమైన ప్రేమమూర్తి యనగా, నేను కౄరముగా, స్వార్థముగా దానినోటి లోనిది తీసుకొనుచున్నను, తాను తినుట మానివేసి, నాకు యిచ్చివేయుచు, నేను తినుచుండ, నా వైపు ప్రేమగా చూచుచుండును. నాకు అవసరము లేకున్నను మొదట నా తల్లి ఆహారము లాగికొని తినుట, తదుపరి నాకు ఆహారము పెట్టినది గూడ తినుచుండుట, నా తామసమైన స్వార్థపు స్వభావమును చూచి శ్రీ స్వామీజీ చాల బాధపడుచుందురు.

నన్ను హృదయపూర్వకముగా నా రెండవతల్లివలె ప్రేమించెడి లలితాదేవితో శ్రీ స్వామీజీ నా స్వార్థపు గుణము గురించి చెప్పగా ఆమె నేనింకను బేబీని ఛోటా రామీని గాన వయస్సు రాగానే యిట్టి స్వల్ప గుణములను వదలివేసెదనని నన్ను బుజ్జగించుచు శ్రీ స్వామీజీకి సమాధానము చెప్పుచుందురు. నీవలెనే నాకు జలము అన్న చాల ప్రీతి. అప్పుడపుడు గదులలో నేలమీద నున్న నీళ్లను త్రాగుట జూచి, శ్రీ స్వామీజీ వెంటనే నీరు పోయించగా దానిని గడగడ త్రాగుచుందును. నీవు తోటపల్లిలో స్వామీజీ పాదములు కడుగుకొన్న నీటినిగూడ భక్తితో త్రాగెడిదానవట.

నీ మంచిచెడ్డలు అన్నియు చూచుచు, నీతో స్నేహముగా, మన మిద్దరము వేరుగా రెండుగాక, ఒక్కటిగా ప్రేమతో జీవించుటకు త్వరలో వచ్చుచుంటిని. శ్రీ స్వామీజీకి నీయందు ఎంత ప్రేమ యున్నదనగా రాత్రి ప్రార్థన సభలో కొందరు భక్తులు "ఈ సంవత్సరము ఇంతత్వరగా ఏల వెళ్ళుచుంటిర"ని ప్రశ్నింపగా, తోటపల్లిలో బడారామీ నా కొరకు వేచియున్నది. నావలన రామీ జంతువైననూ బాధపడరాదు. దానిని తృప్తిపరచుటకై వెళ్ళుచుంటినని చెప్పుచుండిరి.

నమ్మినవారికి నిరాశ గల్గించకుండ మానవులనైనను, జంతువులనైనను, ప్రేమించుచు, అందరికీ తోడ్పడుటయే స్వామీజీ మతము. గాన ప్రేమయే దైవము. దైవమే ప్రేమ. ప్రేమ యున్నచోటనే దైవముండెనని శ్రీస్వామీజీ సదా చెప్పుచుందురు.

ఈ రోజులలో శ్రీ స్వామీజీ కాలముయొక్క విలువను ఇంకను హెచ్చుగా గ్రహించి యిదివరకువలె బైటకైనను వెళ్ళుటలేదు. గంటలకొలది వారటులనే ఏకాంత ములో ధ్యానించుకొనుచుండ వారి మంచము క్రిందనే నేను గూడ పరుండి యుం దును. వారు వ్రాసుకొనుచుండ వారి పాదమువద్దనే వేచి యుందును. ఇచ్చటి చలిచే స్వామీజీ కాళ్ళు చల్లబడి వంకరపోవుచుండ, వారి గదిలో ఎలక్ట్రిక్ హీటరును చాల చలిగా నున్నపుడు వాడుచుందురు. నేనుగూడ గంటలకొలది దాని దగ్గరనే పరుండియుందును. భ్రమచే ఒక్కొక్కసారి ఎలక్ట్రిక్ హీటరు (ప్లగ్) సంబంధము

తీసివేసినను, దాని దగ్గరనే వేడి వచ్చుచున్నదని భ్రమించుచు పరుండి యుందును. నాకు సదా ఆడుకొనుట యన్న చాల యిష్టము. ఇచ్చటవున్న నల్లపిల్లికిని నాకును చాల స్నేహము. తరుచు దానితో ఆడుచు ఆ పిల్లిని క్రిందపడవేయుచు చాల అల్లరి చేయుచు గదిలో యున్న సామాను అంతయు క్రింద మీద పడవేయుచు ఆడుచుందుము. మేమెంత అల్లరి చేయుచు, ఆడుచు సామాను పాడుచేయుచున్నను, శ్రీ స్వామీజీ మా ఆటలను, మాకుండెడి ప్రేమను జూచి చాల ఆనందించుచుందురు. కాని ఒకసారి నేను కౄరముగా పిల్లిపిల్లను నా పండ్లతో పట్టుకొని లాగుచుండ, శ్రీ స్వామీజీ మందలించిరి.

నీవు గూడ పరాయివాళ్ళను, ప్రవృత్తిపరులను మీదపడి కరచుచుందువని వింటిని. యిట్టి హానికరమైన పనులు, జంతువులలోనైనను, మానవులోనైనను వుండ రాదనియు, అందరము ప్రేమగా యుండవలయుననియే మన స్వామీజీ జీవిత సారాంశము. కాన మనముగూడ వారివలె ప్రేమమూర్తులుగా యుండవలెనని, నేను చిన్నదానినైనను నీకు ఉపదేశించుట సాహసము. ఏదైనను మంచి చిన్నవారి నుండియైనను జంతువుల నుండియైనను నేర్చుకొనుచు తరించవలెననే శ్రీ స్వామీజీ సదా బోధించుచుందురు.

ఇచ్చట ప్రతీరోజున, సాయంత్రము ప్రార్థన జరుగుచుండ నా తల్లికి నాకు గూడ నియమముగా ప్రార్థనలో పాల్గొనవలెనని కోరుచు, మేము లోపలకు రాకుండ తలుపులు వేసినను తలుపు దగ్గరనే యుండి తలుపు రెక్కలుకొట్టుచుందుము. మేము లోపలికి వెళ్ళినచో నిశ్శబ్దముగా యుండక అల్లరి చేయుచుందుమని, వారి భజన పాడు చేయుదుమనియు అపుడపుడు మమ్ము భజనకు రానీయనందుకు శ్రీ స్వామీజీకి బాధ కల్గుచుండును. ఈ రోజులలో ఏలనోగాని, స్వామీజీ, వారి కాల మంతయు, చాల నివృత్తిగా వారి గదిలోనే గడుపుచు, అపుడపుడు ప్రార్థనకు గూడ రాకుండుట భక్తులకు చింతగా యుండును.

నీకు ఆశ్చర్యముగా తోచినను, ఒకొక్కసారి నేను ఎవరికి తెలియకుండ, ప్రార్థన హాలులో ప్రవేశించి శ్రీ స్వామీజీ తరఫున, వారు లేనపుడు, అనేకమైన కుర్చీలు, సోఫా మొదలగున వున్నను నేను స్వామీజీ స్థానే ప్రార్థనకు వచ్చితినన్నట్లు వారు కూర్చొనెడి సోఫా కుర్చీమీదనే కూర్చుని భజనలు చూచుచుండ కొందరు భక్తులు ప్రేమ హృదయము గల్గినవారు శ్రీ స్వామీజీ సింహాసనము స్థానములో నేను వారి పీఠమును అధిష్ఠించియుండుట జూచి ఆశ్చర్యపడుచుందురు.



తోటపల్లిలో భజన జరుగుచుండ నీవు గూడ స్వామీజీ కాళ్ళ దగ్గరగనే వారి కుర్చీ క్రింద యుందువనియు, నిన్ను దూరముగా కట్టివేసినచో, విడిచిపెట్టు వరకు అరచుచునే యుందువనియు, వదలి పెట్టగానే నిశ్శబ్దముగా స్వామీజీ పాదముల చెంత చేరి అచ్చటి భజనలో పాల్గొందువని విని ఆనందించితిని. నేను యిప్పుడీ పెద్ద ఉత్తరము, నా భావనలన్నియు శ్రీ స్వామీజీచే వ్రాయించుచుండ ఎచ్చట వుంటినో ఊహించగలవా? వారి పాదములవద్దనే పరుంటిని. నాకు చలిగా వుండునని స్వామీజీ ఇపుడే లేచి ఎలక్ట్రిక్ హీటరు పెట్టితిరి. నా స్నేహితురాలైన పిల్లిపిల్ల గూడ వచ్చి స్వామీజీ పాదములు నాకుచుండెను. అది స్వామీజీ వడిలోనికి ఎక్కి కూర్చొనును. వారి భుజముల మీదికిగూడ ఎక్కుచుండును. నేను కొంచెము బరువుగా నుండుటచే నన్ను మీదికిఎక్కనీయరు. పిల్లిపిల్ల వారు వ్రాసుకొనెడి బల్లమీదకు ఎక్కి శ్రీవారు వ్రాయుచున్న కలమును పట్టుకొనుచుండును.

అచ్చట నీకు దుమ్ములు దొరకవని వింటిని. ఇచ్చట తోటమాలి శాఖాహారి కానందుననో, ఏలనో అన్నియు దుమ్ములే. నాతల్లి జిమ్మీ రోజూ నా పండ్లు దుమ్ములను కొరికి వాడిపరుచు కొనుటకు ఏదో యొక దుమ్మును తెచ్చుచుండును. సారము లేని దుమ్ములను కొరకుచు కొంతకాలమును వ్యర్థపుచ్చుచుంటినని స్వామీజీ విచారించుచుందురు. ఒక్కొక్కసారి స్వామీజీ కాలిజోడును తీసుకొనిపోయి దానితో ఆడి ఆడి చివరకు అలసిపోయి దాని మీదనే నాతల నుంచుకొని పరుండి యుండుట జూచి శ్రీ స్వామీజీ వగైరాలు ఆశ్చర్యపడుచుందురు. అది నాకు ఆనందము నిచ్చుచుండును. ఎవరి పిచ్చి వారి కానందముగదా! మన స్వామీజీకి లోపల వారి హృదయములోనికి ఏ ఆలోచన వచ్చినను వెంట వెంటనే అందరితో పంచుకొనుటకు వ్రాయుచుండుట వారి పిచ్చి అని చెప్పుచుందురు.

అవతార పురుషులైన శ్రీరామకృష్ణ పరమహంసల వారి పేరు ఎన్నడైనను వినియుంటివా ? ఆ మహనీయుడు లోకములో అందరూ నీవు నేను అందరూ పిచ్చివాళ్ళు అని నుడివియుండిరట. ఎవరి పిచ్చివారికి ఆనందమని, తమ పిచ్చియే గొప్పదని అనుకొనుచుందురట. నీపిచ్చి ఏమో నీవు తెలుసుకొనవలెను. నా పిచ్చిని నేను తెలుసుకొనవలెను. దుమ్ములు కొరుకుట, మనుష్యులను కరచుట, విలువైన కాలమును వ్యర్థమైన మాటలతోను, మొరుగుటతోనే వృథాపుచ్చుచు జీవితమును పాడుచేసుకొనకుండా దినదినాభివృద్ధిని గాంచవలెనుగదా!

"మనుజుండై, పశువౌటకంటె-పశుజన్మంబెచ్చు" మన జన్మలే గొప్పవని ఒక కవిపుంగవుడు వ్రాసెనట. ఆ పద్యమును నీవు ఎప్పుడైనా వినియుంటివా?

అన్నిటికంటెను ముఖ్యముగా శ్రీస్వామీజీ నీకు ఒక చక్కని మహామంత్రము వంటి పాటను ప్రత్యేకముగా నీ కొరకు వ్రాసి దానిని నీకునేర్పుచు శ్రీ సంగీతముమాష్టరు గారిని ఫిడేలు మీద వాయించుచు నీకు నేర్పమనిరట. వారు ఆ పాటను–

రామ రామ యనుమా రామీ

రాముని మరువకుమా రామీ !

అని నీకు నేర్పుచుండ నీవు ఫిడేలు వాయించు దగ్గరకు వచ్చి నేనుకూడ వాయించెద నన్నట్లు సంగీతం మాష్టరుగారి కమాను కఱ్ఱను పట్టుకొనుటకు ప్రయత్నించుచుండ చూచినవారు నీ భక్తికి ఆశ్చర్యపడినట్లు వింటిని నిజమేనా?

దైవపరితాపనతో నిండియున్నవారి జన్మలు దుర్లభమైనవి. పరమ పావనమైనవని శ్రీ స్వామీజీ సదా చెప్పుచుందురు. జంతు జాలమునకైనను, మానవాళికైనను దైవభక్తియే ముఖ్యము. ఆధారము. దైవ పరితాపనయే గమ్యస్థానమును చేర్చుచుండునని శ్రీ స్వామీజీ శలవిచ్చుచుందురు.

త్వరలో వచ్చుచుంటిని గాన కొదువ విషయము లన్నియు ముఖస్థముగా మాట్లాడుకొనవచ్చును. నీ ప్రేమ భిక్షను కోరెడి నీ ఛోటా రామీ నీకు నమస్కరించుచు ఈ ఉత్తరము ముగించుచున్నది.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

(శాంతి ఆగస్టు 1967)

## మా రామీల దైవారాధన

దైవారాధన యెన్నో రీతులుగా నుండును. పెక్కు సంవత్సరముల నా జీవితానుభవములో, మానవులేగాక పశుపక్ష్యాది జంతువులు, చివరకు పుష్పములు గూడా దైవారాధన చేయుచున్నవని గ్రహించగల్గితిని. ఒకచిన్న రోజా పుష్పము మొగ్గగా యున్నప్పుడు చూచి అది ఆరాధనకు సిద్ధమగు చున్నదని తలంచెదను. అది వికసించుచుండ దైవారాధన చేయుచున్నదని దానిని చూచుచు ఆనందించుచుందును. అది ఆరాధన చేయుచుండ, యీ రోజులలో తరుచు దానివద్దనే కూర్చుని పుష్పముయొక్క నిరాడంబరమైన దైవపూజను చూచుట, నాకెంతయో ఆనందముగా యుండును.



చిన్న పుష్పారాధనచే పరిసర ప్రాంతములన్నియూ చక్కనైన సువాసనతో నింపబడు చున్నవికదా!

ఓ మానవుడా! నీ ఆరాధనయొక్క ఫలితమేమి? నీవు రోజూ పూజ,పునస్కారములు నియమముగా ఆరాధనలో పుష్పములను త్రెంచి గూడ పూజలు చేయుచుంటివి. దానివల్ల నీలో యేమైన మార్పు, వృద్ధియున్నదా! నీ ఆరాధనవల్ల యితరులలో మార్పు గలుగుచున్నదా? నీ ఆరాధన, నీవున్నచోట శాంతి, ప్రేమలను విస్తరింపచేయుచున్నదా? నీవు నిత్యమూ చేయుపూజ, పునస్కారములనూ, ఆరాధనలనూ నీవే పరీక్షచేసుకొని, దినదినాభివృద్ధిని గాంచుచూ దీప మారిపోకముందే గమ్యస్థానము చేరెదవుగాక!

**ఇప్పుడు మారామీల దైవారాధనను విమర్శింతము:**

బడారామీతో నేను చెప్పకుండగ నీలగిరి వెళ్ళినందుకు అది ఆహారముమాని, నాకై బెంగపెట్టుకొనినదని ఆశ్రమ వాసులు వ్రాయగా నేను కొంత విచారించి, నేను చేసిన పొరపాటునకు పరిహారముగా, ఛోటారామీని నీలగిరినుండి తీసుకొని వచ్చి, బడారామీకి అర్పించితిని. కొత్తచే బడారామీ చిన్నరామీని కరచునేమో యని, కొంత తటపటాయించితిని. కాని బడారామీ ఛోటా రామీని చూడగనే ప్రేమించ సాగెను. ఒకదానిని మరియొకటి వాసనచూచుచు, నాకుచూ ప్రేమించుటచూడగా నాకెంతయో ఆనందము కలిగెను. నా ప్రేమపూర్వకమైన చిన్న అర్పణను బడారామీ అంగీకరించె నని యెంతయో తృప్తిని పొందితిని.

ఇప్పుడు రోజూ ఉదయము సాయంత్రమేగాక తరుచు బడారామీ ఛోటా రామీతో, ఐకమత్యముతో ఆడుకొనుట క్రింద, మీద పడుట కరుచుకొనుచున్నట్లు నటించుట పరవశత్వముతో అవి ఆడుకొనుచుండుట చూచుచుండ, నాకు ఒక ఆరాధనగా తోచుచు తదేక నిష్ఠతో ఆనందముతో వాటి ఆటలనూ,ఆరాధననూ వీక్షించుచుందును.

పెద్దరామీ చాల బలమైనది. శక్తిగలది గాన అది ఒక్క నిమిషములో చిన్న రామీని కరచి చంపివేయగల శక్తియున్ననూ, దానిని నోటిలో పెట్టుకొని కరచు చున్నట్లు నటించుచు, అటులనే గంటలకొలది ఆడుకొనుచుండును. ఛోటారామీ బడారామీ ముందు ఏనుగు ముందు పిల్లివలె నున్నట్లుండియూ బడారామీమీద క్రిందపడి దాని కాలో, తోకయో తీసుకొని లాగుచూ ఒక్కొక్క పర్యాయము దాని నోటిలో తన మూతిని పెట్టి ఆనందముతో, నిర్భయముగా ఆడుకొనుచుండును. ఈ మూగ జంతువుల నిత్యారాధన దైవమునకెంతో ప్రీతి పాత్రమని నా

వెట్టినమ్మకము. ఏలనన వీటి ఆరాధనలలో మేము ప్రార్థించుచుంటిమి, మేము పూజలు చేయుచుంటిమనెడి జ్ఞప్తియేలేదు. అహంకార రహితమైన ఆరాధనలే అవి యెవరు అర్పించిననూ దైవము నకు ప్రీతికరములు. మానవులలో మేము కుంకుమ పూజలు చేస్తిమి, సహస్రనామార్చనలుచేస్తిమని, లక్షపత్రిపూజ, కోటి పత్రి పూజలు కూడ చేస్తిమని, అహంభావనతో డప్పు వాయించినట్లు ప్రగల్భములు పల్కుచుండ దైవము నవ్వుచుండును.

మా రామీల దైవారాధనలో లేశమైన అహంభావము లేదని గ్రహించుటకు మీరు స్వయముగా చూడవలెనుగాని, నేను మీకు వర్ణించి చెప్పజాలను, ఈ మధ్య ఒక సాయంత్రము వాటి ఆరాధనను వీక్షించుచుండ అవి రెండునూ క్రిందమీద పడుచూ ఆడుచూవచ్చి నా పాదములపై పడగా పాదము బెణికి మూడు దినములు నడవజాలక ఒకచోటున వుండి బాగా ధ్యానము చేసుకొనుటకు, నివృత్తిగా వుండుటకూ, నేను కూడ యేకాంతముగ దైవరాధన చేసుకొనుటకు సావకావము కల్పించినవి. రెండు రామీలు ఆడి, ఆడి వాటి ఆరాధనతో అలసిపోయి నా పాదములవద్దకు వచ్చి పరుండును. వాటి ఆరాధన పూర్తవగనే ఒక్కొకసారి నావైపు చూచుచుండ అవి, నన్ను వాటి ఆరాధన ఎట్లున్నదని అడుగుచున్నట్లుండును. అప్పుడు నేను వాటితో మీ ఆరాధనతో నేనానందించిననూ లేకున్నను సర్వాంతర్యామి యైన దైవము మీ ఆరాధన అందుకొనుచుండుననిచెప్పుచుందును.

ఈ సందర్భములో మా రామీలు దైవారాధన చూచినప్పుడెల్లనూ, మరియొక గొప్ప ఆరాధన నాకు జ్ఞప్తికి వచ్చుచుండును. అది ఒక ప్రసిద్ధి కెక్కిన "రోమన్ కేథలిక్కు మోనస్టరీ" అది పవిత్రమైన,పరమపావనమైన,నిశ్శబ్దమైన ఆరాధన చేసెడి స్థలము. పాశ్చాత్యదేశములో ఫ్రాన్సులో యిదియొక ప్రసిద్ధికెక్కిన ప్రార్థనాలయము. అది యెంత పవిత్రమైనదనగా దానిని చూచుటకైననూ ప్రవృత్తి పరులైన ప్రాపంచికుల కందు ప్రవేశము లేదు. నియమముగా అందు ప్రార్థన ధ్యానాదులు చేయుచున్న వందలాది నన్సు (ఫాదర్సు) ఉదయము, సాయంత్రము ప్రార్థనలు ధ్యానములూ నిశ్శబ్దముగా సల్పుచుందురు.

ఆ ప్రసిద్ధికెక్కిన (ప్రార్థనా లయములో) ఒక వంటలు చేయువాడుండెను. అతడు ఆ దేవాలయములో ప్రవేశింపక ముందు గారడీ వారితో తిరుగుచు పళ్ళెములెగరవేయుట, కత్తులతో ఆడుట, మొదలైన గారడీ విద్యలను నేర్చుకొనెను. అతనికి మరేపనియూ చేతగాక వంటపనులలో ప్రవేశించెను. చదువు లేనందున అందరి ఫాదరీలవలె ప్రార్థన అయిన చేయజాలకుంటినని విచారించుచుండెను. ఆ పెద్ద



దేవాలయములో, మూలవిరాట్టు విగ్రహము మేరీజనని. ఈ మేరీజనని లోకైక జనని ముందే ఫాదరీలు, నన్సు, సోదరీమణులు పాటలుపాడుచు నిత్యమూ పూజ పునస్కారములు చేయుచుందురు. మన వంటవాడు యీ పూజలు, పాటలు ఆరాధనలన్నియు వినుచూ, చూచుచు, తనకు చదువులేదు గాన యీ ప్రార్థనలో పాల్గొనజాలనందుకు విచారించుచు ఒకరోజున తనకు వచ్చిన విద్యనే తన దేవిముందు ప్రదర్శించుటకు నిర్ణయించుకొనెను. ఆశ్రమవాసులందరు ప్రార్థన, ధ్యానాదులు పూర్తిచేసుకొని తలుపులు దగ్గరగావేసి చనిరి. అప్పుడు వంటవాడు పళ్ళెములు, చిన్న చిన్న కత్తులు ఇతర పరికరములు దేవి ముందు కూర్చొని తన గారడీ విద్యను దేవిముందు ప్రదర్శించుటకు ఒక్కొక్క ఆటనూ పళ్ళెములతో, కత్తులతో ఎగరవేయుచు క్రింద పడకుండ వానిని పట్టుకొనుచు ప్రదర్శించుచుండెను. ఈ ఆరాధనతో అతడు తృప్తి పొంది యిటులనే యెవరూలేని సమయములో దేవికి మేరీజననికి తనకు వచ్చిన విద్యను అర్పించుచుండెను. ఆ మోనాస్టరీ దేవాలయములోని ఒక ఫాదరీ యీ గారడీ ప్రదర్శనము, మేరీముందు ఆదిశక్తివద్ద చేయుచుండ చూచి, లబో, లబో అని చెంపలు వాయించుకొనుచు, దేవాలయ అధికారి బిషప్ మతకర్త వద్దకు వెళ్ళి దేవాలయమున జరుగుచున్న అపచారమును రోదనతో చెప్పదొడగెను.

దానికి ఆ మత గురువు చాల విషాదము చెందుచూ పరుగున వచ్చెను. మరి కొందరు ఫాదరీలు రోషముతో కఱ్ఱలను కూడదెచ్చిరి. గుడి ద్వారముల వద్దకు వచ్చి లోనికి చూడగా మహత్తరమైన, హృదయములు జలదరించెడి,మహోత్కృష్టమైన దృశ్యమును గాంచిరి. మన వంటవాడు తనకు వచ్చిన గారడీ విద్యను యే ఫలితమును కోరకుండ స్వార్థ రహితముగా మాతృదేవికి మేరీజననికి అటుల చూపుచుండ, ఇతడు అలసిపోయి చమటలు కార్చుచుండ కృపామయురాలైన, సర్వజీవులకుమాతృ దేవియైన మేరీజనని తన పీఠము నుండి క్రిందకు దిగివచ్చి తన పైట చెంగుతో ఆ వంటవాని నుదుటి చెమట బిందువులను తుడుచుచుండెను. ఈ మహాదృశ్యమును, భగవత్ దర్శనమునూ గాంచి మతగురువు, ఫాదరీలు, నన్సు అందరూ ముగ్ధులై, తమ జన్మలు కూడ పావనమైనట్లు ఆనందించుచు యెచ్చటివారు అచ్చటనే మాతృకృపకు ధన్యోస్మి! ధన్యోస్మి అని తలంచుచూ యెవరి తావులకు వారు మత గురువు దేవాలయాధికారితో చనిరి.

ఇటులనే మా రామీలు ఆడుచూ, పాడుచు క్రింద మీదలకు దుముకుచూ, ఒక దానిని మరియొకటి కరచుచున్నట్టు నటించుచు సర్వమునూ మరచి, తను, మనో శక్తుల నర్పించి దైవారాధన చేయుచుండ, పైన నేను వ్రాసిన ఆ వంటలవాడు,

ఆ మహాభక్తుడే నాకు జ్ఞప్తికి వచ్చుచు, మా రామీల ఆరాధన కూడ దైవమునకు ప్రీతికరమని, అవి ఆడుచుండ, దైవము వాటి అమాయకమైన స్వార్థరహితమైన ఆరాధనను ప్రేమపూర్వకముగా అందుకొనుచూ, ఆయన వీక్షించుచుండెననియే నా వెఱ్ఱినమ్మకము.

ఇంతవరకు భూమిపై పశు,పక్ష్యాది మానవులచే చేయబడుచున్న ఆరాధనలనే విమర్శించితిమి కాని, ఆకశమున జరుగుచున్న ఆరాధనలను పరీక్షింపలేదు. ఆకాశమున మిళుక్ మిళుక్ మని సదా ప్రకాశించుచున్న నక్షత్రములను గాంచుడు! జీవన్ ముక్తులై చనిపోయిన ఋషిపుంగవు లందరూ ఇప్పుడు నక్షత్రములుగా ఆకశమున ప్రకాశించుచుందురని మహనీయులచే చెప్పబడుచున్నది. అట్టి మహనీయులు ఆకాశములో గాలిలో అమూల్యమైన తమ కాలమును వ్యర్థపుచ్చురుగదా? వారి ప్రకాశమే నిత్యారాధన. మనము కూడ నక్షత్రములవలె నిత్యారాధన చేయుచు మన ప్రకాశమును దైవార్పణచేతముగాక !

నా జీవితములో రామీలు దైవారాధన చేయుచుండ వాటిని వీక్షించుచు దైవ సన్నిధి ననుభవించుచు నా కాలము నీ రోజులలో గడుపుచుండ, ఆ క్షణములు పరమ పవిత్రమైనవిగా భావింపుచు మహదానందమును పొందుచుందును. నాతో సర్వసాక్షి స్వరూపుడైన దైవముకూడ, రామీల ఆరాధనను అందుకొనుచు, తృప్తి పడుచుండెనని నా నమ్మకము.

ఇంతకూ ముఖ్యమైన రహస్యము ఎవ్వరెవ్వరు ఏ యే పూజలు ఆరాధనలు, అర్పణలు చేసినను “అహం” వున్న అవి ఫలింపజాలవు “అహం” స్వార్థములేని ఆరాధనలు, అవి పుష్పములు చేసినను, మూగజంతువులు చేసినను, గారడీవాడు చేసినను, అదియే దైవమునకు, ఆదిశక్తి మేరీజననికి ప్రీతికరములు.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

**అర్పణ**

**నేనీ వ్యాసము వ్రాయుచుండ తమ ఆరాధన పూర్తిచేసుకొని, అలసి, సొలసి నా పాదములంటి పెట్టుకొని పరుండియున్న చిన్న రామీకి, తదేకనిష్ఠతో, నా వైపు చూచుచుండెడి పెద్ద రామీకి నా ప్రేమపూర్వకమైన అర్పణ.**

**హరిః ఓం తత్ సత్**

(శాంతి సెప్టెంబరు )1967



## రామీ నీ ఆశయమేమి?

గంటలకొలది రామీ నావైపు జూచుచుండ నేను రామీవైపు జూచుచు తలవని తలంపుగా రామీ నీ ఆశయమేమి? నీ జీవితాశయమేమి? అని అడుగుచుందును.

రామీగూడ ఒక్కొక్కమారు మీ జీవితాశయమేమి? అని అడుగుచున్నట్లు తదేక దృష్టితో నావైపు జూచుచుండును. ప్రథమమున రామీ దినచర్యను దాని కదలిక, మెదలిక ప్రవర్తనను బట్టిరామీ ఆశయమును విమర్శింతము. తర్వాతను నా ఆశయమును గూడ రామీకీ, మా శాంతి పాఠకులకుజెప్పుటకు ప్రయత్నించెదను.

రామీ నన్ను అహర్నిశములు విడువకుండగా అంటిపెట్టుకొని వుండుట జూచిన దాని ఆశయము కంటికిరెప్ప పోలికగా నన్ను సదా కాపాడుచుండుటయేనా? అన్నట్టు యుండును, శరీరమును, ఛాయ క్రీనీడ వెంబడించినట్లు రామీ నేను యెచ్చటకు వెళ్లిన అచ్చటకు నా ముందుగనే వెళ్ళుటకు సిద్ధముగా యుండును.

ఒక్కొక్కసారి నా చుట్టును ప్రదక్షిణ చేయుచుండును. కొన్ని సమయముల యందు నా పాదములను నాకుచుండును. నేను నిస్పృహగా వేరే ధోరణిలో పడియుండిన దగ్గర వుండి జూచిన ప్రేక్షకులు రామీ ప్రదక్షిణ జేయుచున్నదని పాదములు నాకుచున్నదని జెప్పుచుండ నేనుగూడ ఆశ్చర్యము పడుచుందును.

రామీ దినచర్య నా దినచర్యతోనే ప్రారంభించుచుండును. అది నా మంచము క్రిందనే పరుండును. ఏ రెండు మూడు గంటలకో నేను లేచినప్పుడు నాతో లేచి సాష్టాంగ నమస్కారము చేయుచున్నట్లు ఒళ్ళు విరుచుకొనుచుండును. తర్వాతను నేను పనిజేయు గదిలోనికి వచ్చి వ్రాసుకొనుచుండ అచ్చట నిద్రించుచున్న గురుకుల బాలురతో వారి మధ్యను రామీ నిద్రించును. ప్రార్థనకు టైముకాగానే రామీ బాలుర ముసుగులు దుప్పట్లు నోటితో లాగివేయుచు ప్రార్థన టైము అయ్యెను గాన మీరు నిద్రనుండి లేచి ప్రార్థన జేయుడు అన్నట్లు వారిని నిద్రనుండి లేపును. ఆ దృశ్యము చూడదగినది.

తెల్లవారురుఝామున బస్సుకు బాలురచే ఉత్తరములు పంపిన వారితో వెళ్ళి దారిలో పూజ్య రామానంద స్వామీజీని దర్శించి, ఇంకా చంటి మొదలైనవారిని లేపు చుండును. బస్సుకి యెక్కి ఒక్కసారి బస్సులోయున్నవారి నందరినీ జూచి బస్సు వెళ్ళగనే నా వద్దకు పరుగున వచ్చుచుండును. నేను వ్రాసుకొనుచున్న కుర్చీ క్రిందనే వుండును. బడలికచే పరున్న మరల మంచము క్రిందకు వచ్చి రాత్రియైనను సరే పగలు యైనను సరే రామీయు యెన్ని గంటలైనా పరుండును.

నేను స్నానమునకు వెళ్ళిన రామీ నా స్నానముల గదివద్ద కాపలా కాయు చున్నట్లు వేచియుండును. ఫలహారమునకు వెళ్ళిన కుర్చీ క్రిందనో,బల్లక్రిందనో నేను వెళ్ళకముందే రామీ వేచి యుండును.

రామీకి షికారు జేయుట, ఆశ్రమంలో పచార్లుజేయుట చాల ప్రీతి.నాకు గూడ ప్రీతియే. ఆశ్రమ పనిపాట్లు, వచ్చే పోయెడి ప్రేక్షకులచే ఒక్కొక్కసారి బైటకు వెళ్ళుటకు వీలు లేక గదిలోనే బంధింపబడినట్లు వుందును.

అప్పుడు రామీ నావైపు జూచుచు ముందు అడుగు వేయుచు మీ ఆరోగ్యం కొరకైనను పైకి రండు అన్నట్లు వుండగా రామీకొరకైనను దానిని ఆనందపర్చుటకై షికారుగా వెళ్ళి పనిబాట్లు జూచుచుండ రామీ నాకంటె ముందుగ వెళ్ళి అందరనూ పలకరించుచు పనిపాట్లు జూచుచుండును.

మీరు నమ్మినను నమ్మకున్నను ఒక పవిత్రమైన ఆశ్చర్యమైన సత్యమును యీ మధ్యను వాల్తేరు వెళ్ళినప్పుడు నిర్వాణాశ్రమంలో ఒక్కరోజు గడపగా అచ్చట జరిగెను. కిత్తయ్య అను నతడు పది సంవత్సరముల పైగా నిర్వాణాశ్రమంలో కొబ్బరితోటను అచ్చట భూమిని జూచెదనని వాగ్దానంజేసి దానిమీద శిస్తుయైనా సరిగా యివ్వకుండగా కొబ్బరికాయలను చెట్లును గూడ మ్రింగివేయుచుండెను. అంతటితో తృప్తి పొందక ఆశ్రమభూమిని గూడ తాను తీసుకొనుటకు ఆలోచించు చుండెను.

ఆరోజున అచ్చట 50 మందివరకు పురుషులు, స్త్రీలు, బాల బాలికలువున్నను, రామీ ఆకిత్తయ్య అనే మోసగాని మీద పడి అతని చొక్కా చించివేసి కరవబోయెను. అప్పుడు మేము విడిపించి రామీని శాంతపరచితిమి. అచ్చట వున్నవారందరూ ఎంతోమంది జనము వుండగా ఆ కిత్తయ్యమీదనే ఏల పడెనని ఆశ్చర్యపడిరి.

నోరులేని మూగజంతువుల భావనలు గూడ మానవులకు అగ్రాహ్యములు గదా? రామీ ఒక విచిత్రమైన వ్యక్తి ప్రేమ స్వరూపిణి, విశ్వాస పాత్రురాలు, నీలగిరి నుండి రామీని ఇచ్చట వున్న ఊరకుక్కలన్నింటిని తరిమివేయునని తీసుకొని వచ్చితిమి. మొదటిలో దాని అరుపు విని ఏ కుక్కయు యీ ప్రాంతములకు వచ్చెడిది గాదు. క్రమముగా రామీయే ఆ కుక్క లన్నింటితో స్నేహము చేసి చిన్నకుక్కపిల్లలతో సహితముగా ఆడుచుండును.

రామీ దాని సంబంధమైన బంధువులను ప్రేమించుచు ఆడుచుండ దాని స్వభావమును యెటుల మార్చి నిర్బంధించగలము? అంతయు దైవవిధి ప్రకారమే



జరుగుగాక! ఇంతవరకు రామీ ఆశయములు విమర్శించితిమి. ఇక రామీ నావైపు గంటల కొలది తదేక దృష్టితో చూచుచుండ రామీ నన్ను మీ ఆశయము ఏమి అని అడుగు చున్నట్లు తోచుచుండును.

అప్పుడు నేను రామీ నీచేత రెండు చిన్న అక్షరముల మాటను మంత్రమును రామా యనెడి పవిత్రాక్షరములను అనిపించుటయే యని జెప్పుచు,

రామ రామ యనుమీ రామీ

రాముని మరువకుమా రామీ

అని గీర్తించుచు రామీకి నేర్పుచుందును, అదినోరు తెరచినప్పుడు రా అనెడి అక్షరమును స్మరించుచున్నదా అన్నట్లుండును. ఇటుల రామీకి రామ మంత్రము నేర్పుచుండ తలవని తలంపుగా పూర్వము జ్ఞానదేవులు దున్నపోతుచే వేదములు జెప్పించిన మరో సంఘటన జ్ఞప్తికి వచ్చుచు నా కాలము సద్వినియోగము జేయుచున్నట్లే తృప్తిని పొందుచుందును. ఇదివరలో వ్రాయబడినట్లు రామీ వృద్ధి అగుచున్నను లేకున్నను యీ రామ మంత్ర స్మరణచే నేను దినదినాభివృద్ధిని గాంచుచుంటినని ఆనందించుచుందును. ఆశ్రమాభిమానులైన శాంతి పాఠకులందర కును పరమ పావనమైన రామ మంత్రమును మా రామీతో కలసి నిత్యమూ స్మరించుచూ తరించెదరుగాక!

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

(శాంతి జూన్ 1967)

## మా రామీ జన్మదినము

నోరులేని మూగజంతువునకు జన్మదిన మేమిటని కొందరు ప్రవృత్తిపరులు శంకించవచ్చును. కాని రామీకి పెద్ద నోరు గలదు. అది సదా మొరుగుచుండ, రామ శబ్దమే నాకు వినిపించుచుండును. అదియుగాక, నేను తెల్లవారుఝాముననే చిన్న రామీకి, పెద్దరామీకి నియమముగా వాటి బిస్కత్తులు పెట్టుచు,

రామ రామ యనుమా రామీ

రాముని మరువకుమా రామీ

అని, విసుపులేకుండ,ఎన్నటికైనా రామీలు రామ నామ ముచ్ఛరింపకుండునా అను నిశ్చయముతో నేర్పుచుందును. కాని, రామీలకు బిస్కత్తుల మీదనున్న ఆప్యాయత రామ నామమందు లేదుగదాయని చింతించుచుందును. ఒక్కరామీలకే అననేల, మానవులలో మాత్రము దైవపరితాపన యెచ్చటనోగాని, వేలాన వేల జనులలో ఏ ఒక్కరికోగాని లేదుగదా అనిగూడ విచారించుచుందును. ఇప్పుడు రామీలనుగూడ, కొంత ఆనందపరచుటకు సముద్రపు వడ్డుననున్న వాల్తేరు ఆశ్రమమునకు (మొబైల్ మెడికల్ వేన్) వేనుమీద తీసుకొనివచ్చితిమి. గురుకుల బాల బాలికలతోబాటు రామీలుగూడ ప్రయాణము జేయుచుండ వారితో అవి కూడ భజన ప్రార్థన జేయుచున్నట్లుండెను.

తోటపల్లి నుండి ఆలస్యముగా బయలుదేరుటచే, ఆశ్రమము చేరుసరికి చాల రాత్రి యయ్యెను. ఆశ్రమవాసులేకాదు. ముఖ్యముగా సముద్రముగూడ మమ్ము జూచుటచే ఆనందించిరి. సముద్రమును జూచుటకు మాకుగూడ చాల ఆనందమయ్యెను. రామీల గురించి వ్రాయనవసరమే లేదు. అప్పుడు నేను రామీలతో సముద్రము ప్రార్థించుచున్నది. మీరు కూడ ప్రార్థించుడు అని జెప్పుచు, నేనుగూడ ప్రార్థింపసాగితిని. సముద్రము యొక్క ప్రతీ కెరటము ఒక ప్రార్థనయే అన్న భావన ఎంత ఆహ్లాదకరమైనది. ఓ మానవుడా! దైవాకారములో చేయబడిన ఓ!మనుజుడా! నీ ఆలోచనలను గూడ ప్రార్థనగా జేసుకొనుము అని జెప్పదొడగితిని. నీ ప్రతీ ఆలోచనయు ఒక్క ప్రార్థనయే! ప్రార్థించుము! ప్రార్థించుము! పట్టు విడుపులు లేక నిరంతరము ప్రార్థించుచున్న సముద్రమువలె, నీవుగూడ నీ ప్రతీ ఆలోచనను ఒక ప్రార్థనగా జేసుకొని ప్రార్థన చేయుము. ఇట్టి పవిత్రమైన భావనలతో ఫలహారముచేసి రామీలు మేము సముద్రము యొక్క ప్రార్థనలను వినుచు విశ్రాంతి తీసుకొంటిమి.



ఉదయమే సూర్యభగవానుడు సముద్రగర్భమునుండి తన దివ్యతేజస్సుతో లోకమునంతను నింపుటకు వచ్చుచుండ, నేను రామీలు గూడ ప్రార్థనలు జేయుటకు సిద్ధముగా, భజనలు, సంకీర్తనలు జేయు దిమ్మపై ఆసీనులమై యుంటిమి. శ్రీ యోగానంద స్వాములు భీముని పట్నమునుండి శ్రీ బోధానందస్వామి యనువారిని కైలాసములో మౌనముగా ధ్యానము చేసుకొనుటకై పంపిరి. వారు గూడ మా నిశ్శబ్ద ప్రార్థనలలో పాల్గొనిరి. అదియొక పరమపావనమైన క్షణము.

మా శాంతి పాఠకులు ఆతృతగా వుందురుగాన, ఇప్పుడు రామీల జన్మదినము గూర్చి పరిశీలింతము. మన బాల బాలికలందరకును ప్రతీ సంవత్సరము జన్మ దినములు చేయుచుండ మన చెంతనే పెరుగుచున్న రామీకి మాత్రము జన్మదిన మేల చేయరాదు?రామీకి ఇంకను సంవత్సరము నిండకున్నను అది ప్రేమపూర్వకమైన సంరక్షణచేతనో మరేలనో బడారామీకంటే పెద్దదిగా పెక్కు సంవత్సరముల వయస్సు గలవానివలె కానవచ్చును. చిన్న రామీ లక్ష్మీవిహారు కోటగిరి శాంతికేంద్రములో క్రిందటి సంవత్సరము మార్చి నెల 20వ తారీఖున జన్మించెను. దాని తల్లిపేరు జిమ్మీ. అదియు ప్రేమ స్వరూపిణియే! రామీతో మరినాలుగు పిల్లలుపుట్టినవి. జిమ్మీ తన ఐదు పిల్లలతో తృప్తిగ కాలముగడుపు చుండెను. ఈ ఐదు పిల్లల్లో ఒక్క చిన్న రామీ మాత్రము అంత చిన్న వయస్సులో గూడ నా గదివద్దకు వచ్చి తలుపు తెరచువరకు అచ్చటనే వేచియుండెడిది. తలుపు తెరవగనే తన చిన్న తోకను ఊపుచు లోపల ప్రవేశించి ఏ మూలనో పరుండెడిది. దాని తోక అప్పుడు ఒకటి రెండు అంగులములకు మించనంత చిన్నదిగా నుండెడిది. రామీకి చిన్నతనము నుండియు మంచి నీరన్న యెంతయో ప్రీతి. సదా మంచినీటిని అప్పుడును ఇప్పుడును త్రాగుచునే యుండును. మిగిలిన కుక్కపిల్లలు నావద్దకు యెన్నడూ రాకున్నను, ఈ చిన్న రామీ మాత్రము నా చుట్టును సదా తిరుగుచునే యుండెడిది. నేను ఉదయమే అతపస్నానము చేయుచుండ, రామీ గూడ నాచెంతకే వచ్చి పరుండెడిది. ఎప్పుడును మొఱిగెడిది గాదు. రామీ ఇంక మొఱుగదా నిశ్శబ్దము గానే యుండునా యన్నట్లు యుండెడిది.

రామీ చిన్నతోకను చూచి యింక పొడవుగా ఎదుగదా అని తలచెడివారము. ఆ చిన్న తోకను యిప్పుడు మీరు జూచిన చాల ఆశ్చర్యపడెదరు. ఇప్పుడు అది అడుగున్నరవరకు పెరుగుటయే గాక, ఒక చక్కని విసనకర్ర ఆకారములో తయారయ్యెను. ఆ తోకను మీరు కూడ జూచి ఆనందించవలసినదేగాని, మేము వ్రాయగా మీరు గ్రహింపజాలరు. "వృద్ధియే జీవితము, వృద్ధి లేకుండుటయే పతన"మని చిన్న రామీ తోకకూడ పాఠము నేర్పుచున్నట్లు తోచుచుండును. నీలగిరి కేంద్రములో

రెండువేళలయందును ప్రార్థనకు గంట కొట్టగనే ప్రార్థనాలయములోరామీ ముందు తయారగుచుండెడిది. చిన్న రామీ ప్రార్థన హాలులో తివాసీలు పాడుచేయునని, గది తలుపులు మూయగా రామీ గుమ్మమువద్ద నుండి తన్నుకూడ లోపలకు రానిచ్చెడి వరకు అరచుచుండ, ఇక గత్యంతరము లేక తలుపును తెరచి లోపలకు రానియ్యగా నిశ్శబ్దముగా, ఒక మూలను భజన వినుచు పరుండెడిది.

ఆశ్చర్యములకు ఆశ్చర్యమేమనగా నేనెప్పుడైనను ఒకొొక్క రోజున ప్రార్థనాలయమునకు వెళ్ళజాలనప్పుడు, రామీ వెళ్ళి అచ్చట అనేకమైన సోఫాలు, కుర్చీలు వున్నను వాటిమీద కూర్చొనక, నేను కూర్చొనెడి సోఫామీదనే అది కూర్చొని బాల బాలికలు పాడుచుండ తదేకముగ వినుటజూచి మన గురుకుల బాల బాలికలు చిన్న రామీకి కోటగిరి శాంతికేంద్రము యొక్క పీఠాధిపతి యని, నామకరణముచేసిరి. బడా రామీ తోటపల్లి ఆశ్రమము అంతా స్వేచ్ఛగ తిరుగుచు, పనివాండ్రకు, ఆశ్రమ వాసులకు, సందర్శకులకు భీతిని గల్గించుచుండును. ఈ పెద్ద రామీని, తోటపల్లి ఆశ్రమ పీఠాధిపతియని పిలుచుచుండుట నాకును ఆశ్చర్యముగా కొంత ఆనందముగా యుండును. చిన్న రామీ జన్మదినము ఇంక వారము రోజులలో రానున్నది. అది క్రిందటి సంవత్సరము మార్చి 20వ తారీఖుననే జన్మించెను. మూగ జంతువులను, తన స్వంత బిడ్డలుగా ప్రేమించుచు, వాటి సేవలో తన జీవితమును గడుపుచున్న శాంతి ఆశ్రమ నీలగిరి కేంద్రమునకు అధ్యక్షురాలైన శ్రీమతి లలితాదేవిగారు, ఈ చిన్న రామీని చాల అదృష్టవంతమైన శునకమనీ, మాచెంత నుండి భజనలలో పాల్గొనుచుపెరుగు చుండుట చూచి ఆనందించెడివారు. ఇప్పుడు రామీ జన్మదినము జేయుట యెట్లు అని ఆలోచించుచుంటిమి. బాల బాలికల జన్మదినములు జేయుచున్నప్పుడు వారిచే ప్రత్యేకముగా భజనలు చేయించుచు ఆ రోజున 108 సార్లు గాని, 58 సార్లుగాని,చివరకు 12 సార్లు అయినా శాంతి ప్రార్థనను ఆ జన్మదినం రోజున జేయించుట జరుగుచున్నది. ఇప్పుడు మా రామీ రామ రామ యనెడి మాటలనే పలుక జాలనప్పుడు ఇక శాంతి ప్రార్థన యెటుల జేయగలదని దీర్ఘముగా ఆలోచించుచుంటిని.

ఉత్తర దేశములో ఒక భక్తిగల్గిన శునకము 'రామ రామ'యనుచు చనిపోయెనని దాని సమాధిని చూచుటకు యెందరో భక్తులు వెళ్ళుచున్నారని వార్తాపత్రికలలో చూచితిమి. దానిని చూచినప్పుడెల్లను, మా రామీలచే జీవించియుండగనే రామ నామము స్మరణ చేయించుటకు కోరుచుంటిని.

"బ్రతికినన్నాళ్ళు నీ భజన తప్పనుగాని, మరణకాలమునందు మరతునేమో" అను పద్యము జంతువులను దలంచిన, మానవులను దలంచినను జ్ఞాపకము వచ్చుచుండును.రామీ ప్రార్థన చేయజాలకున్నను నేను ధ్యాన మందిరమున యుండ, గంటలకొలది రామీగూడ అచ్చట వేచియుండుట, తరుచు నిద్రపోవుచుండుట జూచుట నాకే ఆశ్చర్యముగా కానవచ్చుచుండును. రామీకి పుస్తకముల యందు చాల ప్రీతి. ముఖ్యముగా రాత్రుల యందు ఎవరూ లేనప్పుడు ఏదో ఒక పుస్తకము తీసి కొరుకుచు పాడుచేయుచుండును.



ఒకసారి ఆధ్యాత్మిక మెఱుపులను తీసెను. వెంటనే ఆధ్యాత్మిక మెరుపులు నీకు చాల పెద్ద పుస్తకము. అవగాహన కాదని, దానినోటినుండి లాగివేస్తిమి. మరొొక్క రాత్రి శాంతిపత్రిక తీసెను. పీసు పత్రికగూడ ఒక్కరాత్రి తినుచుండ ఆశ్చర్యమాయెను. ఉపనిషత్తుల సారాంశమనెడి పుస్తకమును ఒక్కనాడు తీసెను. దీనినిబట్టి రామీ నుండి నేను నేర్చుకొన్నది శాంతి. పీసు, ఆధ్యాత్మిక మెరుపులు,ఉపనిషత్తులు మొదలగు చదువులు నోటితో చదువుటయేగాదు,వాటిని నావలె నమలి మ్రింగివేసి, వాటి సారాంశమును రక్తనాళములలో ప్రవేశింపజేసి జీర్ణము జేసుకొనవలెనని జెప్పుచున్నట్లు నాకు తట్టుచుండును. భక్తి, జ్ఞాన, వైరాగ్య గ్రంధములను చదువుట అనగా, ఆయా గుణములను మన జీవితములో అలవరచుకొని దినచర్యలో వ్యక్తపరచుటయే అనెడి, నా అంతర్యభావనలను శాంతి పాఠకులతో పంచుకొనుటకు ఇంతగా వ్రాయుచుంటిని.

రామీ, నీ జన్మదినమునకు ఏమి కావలయునని చి॥ శాంతి నేను యీ మధ్యను తరుచు అడుగుచుండ అప్పుడు అది మావైపు తదేక దీక్షగా జూచుచు, ఒక్క మొఱుగు మొఱుగుచుండ అది బిస్కత్తులు కావలెనన్నట్లు తోచుచుండును. దానికి ప్రియమైన బిస్కత్తులు రెండు చిన్న పెట్టెలు యేర్పరచితిమి. దానికి ఒక చిన్న కవచమువంటివి జన్మదిన జ్ఞాపకార్థముగా కుట్టించుటకు కోరుచుంటిమి. చిన్న రామీతోపాటు పెద్ద రామీ కూడ నూత్న వస్త్రములు ధరించును, గురుకుల బాల బాలికలు రామీ జన్మదిన జ్ఞాపకార్థముగా మాకేమి, దొరకుననిఅడుగుచుండ, రామీకి ప్రీతికరమైన పాయసమునే ఆ రోజున (20-3-68) జన్మదినం జ్ఞాపకార్థముగా అందరకూ పెట్టించుటకు నిశ్చయించితిమి.ఆరోజు భజనలో ఛోటా రామి, బడా రామి ఇంకా ఆశ్రమములో నున్న మూగజంతువుల జ్ఞాపకార్థముగా, ఆశ్రమంలోనేగాక, హిందూదేశమంతటా ప్రపంచమంతటా యున్న నోరులేని మూగ జంతువుల శ్రేయస్సును, ఆయురారోగ్యములను కోరుచు, ముమ్మారు ప్రణవగానమును జేయుటకు నిశ్చయించితిమి. మాపాఠకులకు ఆశ్చర్యముగ తోచినను ఆశ్రమంలో ప్రార్థనకు, భోజనమునకు గంట కొట్టబడినప్పుడు మా రామీలేగాక తదితర శునకములు ప్రణవగానముజేయుచున్నట్లు 'ఓం' అని గంట మ్రోగుచుండగా

అవియు నోరులు తెరచి ఓంకారమునుసూచించుచు అరచుచుండును. అన్ని శబ్దములు ఒకే పరబ్రహ్మమునుండి వచ్చుచున్నవి గాన వివిధ శబ్దములలో ఒకే శబ్దమును ప్రణవనాదమును గుర్తించగల్గిన వారి జీవితములు ధన్యవంతములు. రామీ జన్మదిన జ్ఞాపకార్థముగా మనము గూడ రామనామ స్మరణము నిరంతరము చేయుచు తరించెదముగాక! ఈ వ్యాసము వ్రాయుచుండ ఏలనో భక్తచింతామణిలో-

మనుజుండై పశువౌటకంటె పశుజన్మంబెచ్చు నీవెట్లు దా
నిని బుట్టించితి వట్లు చేయునది హా! నిర్భాగ్యతన్ జ్ఞానమె
ల్లను వ్యత్యస్తముజేసి నీవిధుల నుల్లంఘించెదన్ నేను దం
డన కర్హుండను బ్రోవవే నను దయన్ సద్భక్తచింతామణీ!

ఈ వ్యాసము పూర్తిజేయుచుండ గురుకుల బాలురు హరేరామ హరేరామ రామ రామ హరే హరే అనిపాడుచు నా కుటీరమునకు వచ్చిరి. వెంటనే రామీ వారి ముందు కూర్చొని వారి ప్రార్థన వినుచు ప్రార్థనాలయమునకు వారితో వెంబడించెను. రామీకి జన్మదినపు శుభాకాంక్షలు. అనేక జన్మదినములు వచ్చుటకు కోరుచు లోకశాంతికై యీ వ్యాసమును లోకా స్సమస్తా స్సుఖినో భవంతు అని పూర్తి జేయుచుంటిని.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

(శాంతి ఏప్రిల్ 1968)

## బడా - ఛోటా రామీలకు లేఖ

సముద్రతీరం, వాల్తేరు ఆశ్రమం
20-5-68

ఉదయం 6 గం॥

ఆశ్రమవాసులైన, బడా రామీ, ఛోటారామీలకు సదాశాంతి;

దైవము మిమ్ము ఆయురారోగ్యములతో బ్రోచుగాక! మేమువచ్చే రోజున, మీరిద్దరూ ఉదయం నుండియు నా దగ్గరనే కూర్చొని, నా వైపు చూచుచు, మిమ్ము గూడ నాతో తీసుకొని వెళ్లెదనని ఆతృతగా యుండిరి. గాని మీకు నిరాశ గల్గించి వచ్చుటకు నాకు చింత గల్గెను. పైగా మిమ్ము గదిలోయుంచి, మీరు నన్ను వెంబడించి బలవంతముగా వాను ఎక్కెదరని, మీకు కనిపించకుండా రావలసి వచ్చెనని చింతించితిని.



ఐనను నేనెచ్చటికి వచ్చినను మీభక్తి ప్రేమ విశ్వాసములెన్నటికిని మరువజాలను. నేను ధ్యానము చేయుచున్నప్పుడు గంటలకొలది నన్నే అంటిపెట్టుకొని నావద్దకూర్చొని యుందురు. మీ విశ్వాసము ప్రేమ మానవులలో గూడ కనిపించదు.

మీ విశ్వాసమునకు, ప్రేమకు బంధింపబడి యుంటిని గాన, దారిలోను, యిచ్చటను, యే కుక్కను జూచినను మిమ్ము జూచినట్లే యుండును. యే కుక్కకు తినుటకు యేమి పెట్టినను, మీకు పెట్టినట్లే ఆనందించుచుంటిని.

'అంతా రామ మయం బీజగమంతా' "అందరిలోనున్నదీ దైవమేగదా! తోటపల్లిలో యున్నప్పుడు ఉదయమే మీకు రామ రామ యనుమా రామీ; రాముని మరువకుమా రామీ; అనెడి మంత్రమును ప్రతి దినము నేర్పుచుండెడి వాడను.

ఇప్పుడు నేను దూరముగా వచ్చినను ఆ మంత్రమునే యిచ్చటి నుండి గూడ మీకు చెప్పుచుంటిని. గాన మీ హృదయములలో యున్న రాముని మరువవలదు. మీకేగాక, మాకును రాముడే ఆధారము, గమ్య స్థానము.

మీలో యున్న గొప్పదనము, కొందరు బాల బాలికలవలె మీరు దొంగతనములు చేయరు. అబద్ధములు అసలే ఆడరు. మీ జన్మలు నోరులేకున్నను, అదృష్టవంతములు.

ధర్మరాజు తనను వెంబడించిన శునకమును, స్వర్గమునకు తీసుకొని వెళ్లెనని, మన పురాణములలో చదివితిమి. గాని మీరు నన్ను ఎంత ప్రేమించుచున్నను మిమ్ము తీసుకొని వెళ్లకుండ, నేను హిమాలయములకు వెళ్లుచున్నందుకు విచారించుచుంటిని. మరియొకమారుమీకు నేను రోజూ నేర్పుచున్న, మీ మంత్రమును స్మరించుచు ఈ ఉత్తరమును పూర్తి చేయుటకు కోరుచుంటిని.

రామ రామ యనుడీ రామీలు! రాముని మరువకుడీ రామీలు; సదా మీ వృద్ధిని కోరెడి ఓంకారు.

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

(శాంతి జూన్ 1968)

## రామ - రామీ

స్వేచ్ఛానువాదం; తారకం

నా జీవితంలో 'రామ–రామీ' రెండులేవు; ఆ రెండూ నాలో ఒక్కటే భాగం. 'రామ'ను 'రామీ'లోను, 'రామీ'ని 'రామ' లోను, నేనెప్పుడూ చూస్తుంటాను. ద్వైతం అజ్ఞానం, అద్వైతం జ్ఞానం.

నాలుగేండ్ల క్రితం 'రామీ' శాంతి నిలయంలో పుట్టింది. చిన్న పిల్లగా ఉన్నప్పటి నుండే, నాకూడా వచ్చేది. కావలసినంత నీరు త్రాగేది; నా స్నానపుగదిలోకి వెంబడించి, నీళ్ళు త్రాగి నిద్ర పోయేది. నన్నెప్పుడూ విడువకుండా ఉండేది గనుక, మేము కోటగిరి విడిచి మాతృ ఆశ్రమానికి పయనమవుతోంటే, తోటపల్లి మాతో కూడా వచ్చేసింది.

శీతల వాతావరణంలో పుట్టినా ఉష్ణోగ్రత ఉన్న ప్రదేశంలో కూడా హాయిగానే ఉండేది. గీత ఉపదేశానుసారం, శీతోష్ణాల భేదం లేకుండా, అన్ని పరిస్థితులలోను, అన్ని మార్పులలోను; మనుష్యుల గుంపులలోను, ఏకాంతంగా నిశ్శబ్దంగా ఉన్న స్థలంలోను; ఒకేరీతిని ఉండాలి. రామీకి ప్రశాంత వాతావరణం ఇష్టం. మే మెక్కడికి వెళ్లినా, ఒక ఏకాంతస్థలం వెతుక్కుని అక్కడనే విశ్రాంతి పొందేది. ఎవరన్నా రామీకి ఇష్టమే, కొత్తవారు, పిల్లలు, ఎవరుదానిని మచ్చికచేసి ఆడించినా, అంగీకరించేది. స్నానం చేయించే సమయంలోకూడా, కిక్కురుమనకుండా, పిల్లలు ఎలాతోమినా, శుభ్రపరచినా చేయించుకొనేది. రామీకి పరాయి వారంటూ లేరు. తానెంతో ఆప్యాయంగా, నెమ్మదిగా ఉండేది. అంతా తనవారే. అందరూ తనవాళ్ళే అనుకొనడం ఎంత పుణ్యం! అనేక మానవులకు కూడా ఈ భాగ్యం ఉండదు.

తోటిపల్లి శాంతి ఆశ్రమ ప్రాంగణంలో, జూన్ 12వ తేదీని రామీ ప్రాణం విడిచిందని వార్త వచ్చింది.

'రామీ' ఇంక లేదు.

ఇంక "రామీ" ని చూడలేమా? ఆ దేహాన్ని చూడలేము కాని, ప్రేమపూరితమైన దాని ఆత్మ అంతటా ఉన్నది. కాయాన్ని విడిచిపోయిన ఆత్మ, దానిని ప్రేమించే వారలలో లయమవుతుంది అంటారు. రామీ నన్ను వదలకుండా, నా నీడవలెనే వుండి, నన్ను ప్రేమించేది. నేనూ రామీని నా స్వంతంగానే భావించేవాడను. కాబట్టి రామీ ఆత్మ, తన భక్తి విశ్వాసాలతో, ప్రేమ నైర్మల్యంతో, ఏకాంతంగా నాలో లీనమైపోయి ఉండవచ్చును. దుఃఖం, ఎడబాటు బదులు, ఈ సమయంలో రామీ ప్రేమ, ఆత్మానుభూతి, నాలో ప్రతిమూల, సుస్థిరమయ్యాయి. రామీని ఏనాటికైనా ఎట్లా మరువగలను? రాముడు అమరుడు. రామీ, రాములు ఒక్కటే. రామంలో రామీని, రామీలో రామాన్ని చూస్తోంటాను. అంతేకాదు; మీ అందరిలోను నాకు రామదర్శనం అవుతుంది.



"బోట్" 'జోయ్' అనే అమెరికన్ దంపతులు, "శక్తి" అనే బిడ్డతోసహా, చాలా కాలం మా శాంతి కేంద్రంలో ఉండేవారు. ఇది 'బోబ్' జన్మదినం. ఆయన విశ్వ కుటుంబానికి చెందినవాడు; సమస్త జనుల శాంతి కాంక్షించేవ్యక్తి. బీదలకై, అన్న దానం చేస్తూ, అన్ని మతాలకి చెందిన హిందూ, మహమ్మదీయ, క్రైస్తవ బిడ్డలకు విందు చేయించాడు. ఇంగ్లీషు, తమిళం, తెలుగు భాషలలో ప్రార్థనలు గావించాడు. తమ బడిపిల్లలతో వచ్చిన ఇద్దరు సన్యాసినులు, క్రైస్తవ ప్రార్థన ఐక్య కంఠంతో పఠించారు. భజనలు, ధ్యానం జరుపబడ్డాయి. చుట్టుపట్ల అంతా ఉత్సాహంతో నిండిపోయింది. అందరూ సంతోషంగా ఉన్నారు. కాని, నా ప్రాణం కొంత చివుక్కు మంది. "రామీ" సన్నిధిని అనుభవించాను. ఆ ఉత్సవంలోనేకాక, నాలో నేను రామీ సామీప్యాన్ని పొందగా, నాకు తెలియకుండానే, నా నయనాలనుండి, అశ్రువులు ప్రవహించాయి. "రామీ ఇక్కడనే ఉన్నది; రామీ, నేనూ ఒకటే అని పదేపదే అన్నాను. జగత్తులో ఉన్న ప్రాణులన్నిటి కొరకు, పశుపక్ష్యాదులు, మానవులు మూగి మృగాలు, సుగంధ పుష్పాలు ఇత్యాదులన్నిటి కొరకు, హృదయాలు స్పందించే విశ్వకుటుంబీకులందరికి నా ధన్యవాదాలు.

రామీ మాతృ ఆశ్రమంలో ఉన్న మూడు సంవత్సరాలలోను సంభవించిన కొన్ని మధుర స్మృతులను నా ప్రియమైన పాఠకులతో పంచుకొనకపోతే, నా సందేశం సంపూర్తి కాదు.

తోటపల్లిలో రామీ జీవితయాత్ర అరుణోదయ కాంతులలో ప్రతిదినం, బడా రామీతో సహా చిన్నరామీ నిర్వాణ మందిరంలో ఉన్న నా వద్దకు పరుగు పరుగున వచ్చేవి. నేను

'రామ, రామ యనుమా రామీలు, రాముని మరువ కుడీ రామీ'లు అని ఆ జంటకు నేర్పేవాడిని.

ఈ చిన్నమంత్రాన్ని వాటికోసం కూర్చి, ప్రతిరోజూ నేర్పేవాడిని, అవి అలవరుచుకొని, ఆ మంత్రాన్ని కొన్నిసార్లు ఉచ్చరించిన తరువాత, వాటికి బిస్కట్లు ఇచ్చేవాడను, నేను వాటిని శివాలయంవైపు తీసుకొని వెళ్ళడానికప్పుడు వేచియుండేవి,

నేను జ్ఞాన గుహలోనికి వెడితే, అవికూడా నన్ను వెంబడించి, నాతోపాటు గంటల కొలదీ, మెదలకుండా ఉండేవి.

రామీ 1 మాసం పిల్లగా ఉండగా కోటగిరిలో నన్ను అంటియే నా స్నానం గదిలో ఉండేది. తోటపల్లిలో, అది పెద్దదైన పిదప నేను స్నానం చేస్తోంటే, సుఖంగా ఆ గదిలో ఒక మూల కూర్చొని ఉండేది-నమ్మలేనంత చిత్రంగా ఉండేవి రామీ చేష్టలు స్నానంచేసి, వొళ్ళు తుడుచుకొంటూంటే, రామీకూడా తుడిచి నట్లు నా తడి పాదాలను నాకేది.

నేను భోజనం చేసేటప్పుడు రామీ నా కుర్చీ క్రిందనే పడుకొనేది. రామీకి శాఖాహారమే ఇష్టం; పాలు, అన్నం తినేది; అప్పడాలంటే దానికి చాలా ఇష్టం, జంతికలు మొదలైన వాటిని కూడా తినేది. మనిషివలె పొత్తులను వలచుకొని తినేది.

ఎప్పుడూ మానకుండా, ముఖ్యంగా ఆదివారాలలో, నా ఆధ్యాత్మిక ప్రసంగాలకు నాతోవచ్చి, నా కుర్చీ క్రిందనే కూర్చోవాలని పట్టుబట్టేది. ఆదివారం వచ్చినదంటే చిత్రంగా తానే నాకంటే ముందు తయారై, ప్రార్థనలు జరిగే హాలుకు వెళ్లి, నా కుర్చీక్రింద ఉండేది.

మేము చుట్టుప్రక్కల గ్రామాలకి శాంతి సందేశాన్ని ఇవ్వడానికి వెళ్ళినప్పుడల్లా శాంతి శకటంలో ఎక్కి మాతో వెళ్ళడానికి, రామీ కెంతసరదానో చెప్పలేను. ఒక పెద్ద మనిషిలాగ, కూర్చునే స్థలంలో సీటుమీద ఆశీనుడై, నెమ్మదిగా, ఏమీ అరవకుండా దారికిరువైపులా చూస్తూ వుండేది.

తన శరీరం పోయేరోజు ఉదయమే పోస్టుమాస్టరు సూర్యనారాయణతో, శివాలయమునకు వెళ్ళి అక్కడ అభిషేకము చేయుచుండుట రామీ దగ్గరకూర్చుండి వీక్షించుచుండెను. ఒక్క విషయం మాత్రం నాకు విచారాన్ని కలిగించేది. బడారామీ ప్రోత్సాహంతో మా ఛోటారామీకూడా కొందరు మనుష్యులను చూచినపుడు మొరిగేది నన్నెవరూ ధ్యానంలో ఉండగా, తపస్సుని భంగం చేయకూడదని కాబోలు అవి కొందరినిచూచి మొరిగేవా అనుకొని ఆశ్చర్యపడేవాడిని. అరుదుగా అవెప్పుడైనా మనుష్యులపైపడి కరిచేటంత గొడవచేస్తే, నాకు బాధాకరంగా ఉండేది. ఈ విధంగా జరిగే సమయంలో, ఆ మనుష్యుల తలంపులు పరిశుద్ధమైనవి కావని, వారిని ఆధ్యాత్మిక దృష్టి ఎక్కువగా అలవరచుకొనమని ముఖ్యంగా, నా యెదుట, ఈ పవిత్ర ఆశ్రమంలో అనే భావంతో రామీలుచేసే హంగామా కాదుగదా అని తలంచేవాడిని– రామీలవిషయంలో అవియెప్పుడైనా ఎవరినైనా కరుస్తే మాత్రం నేను బాధపడేవాడిని.



ఆశ్రమవాసులు ఎన్నడైనా సత్సంగగోష్ఠి అయిన తరువాత రాత్రి చీకటిలో తమ వసతులకుపోతుంటే, వారిని మా రామీ, కూడా వెళ్ళి క్షేమంగా విడిచివచ్చేది. అనేకసార్లు విశ్వాలయ చిహ్నంపైన రామీ కూర్చొని, వచ్చేపోయే వారిని, ఆ చిహ్నాన్ని ఉద్దేశించి ధ్యానం చేయమని ఆహ్వానిస్తోందా అనుకొనేటట్లు, వీక్షించేది. విశ్వజనీనతయే తన స్వభావమా అనిపించేటట్లు ఆ చిహ్నాన్ని అంటిపెట్టుకొని సమస్తమత విశ్వాసాలను పలకరించినట్లుండేది. ఛోటా రామీ ఏసుక్రీస్తు పిలచినరీతిని,చిన్న పిల్లల నందరితోను ఆడుకొంటూ, “నావద్దకు రండి” అనేటట్లుండేది.రామీ సామాన్యమైన కుక్కకాదు. కుక్క స్వరూపంలో ఉన్న మానవుడే అని నేను తలవడానికి ఇంకా ఎన్నో నిదర్శనాలున్నాయి. ఆ స్వానుభవాలన్నీ వ్రాసి నా పాఠకులకు విసిగించను.

కొన్ని తడవలు రామీ దిండు మీద తలపెట్టుకొని సోఫామీద శయనించేది. అనేకసార్లు నా పాదాలమీద శిరస్సు వుంచి రామీ నిద్రించేది.

ఇంక రామీయొక్క అపారమైన ప్రేమ, భక్తిని గూర్చి ఎంత వ్రాస్తే తనివితీరుతుంది? ఒక్కటే నేను చేసేది; రామీకి ఎన్నో మానవ స్వభావాలు ప్రసాదించిన, అది శునకరూపాన్ని ఉన్న మనిషే అనిపించేటట్లు ఆశీర్వదించిన పరమాత్మునికి ధన్యవాదాలు సమర్పించడమే, నా వంతు. తోటపల్లి కొండలు నీలగిరి పర్వతాలకు వేయి మైళ్ళ దూరంలో ఉన్నాయి. పరమేశ్వరునికి దూరమనేది లేదు కనుక, తన కుక్క రూపాన్ని విడిచినతోడనే, రామీ నా హృదయంలో ప్రవేశించిందనుకొంటున్నాను.

ఏ మూలమునుండైనా ఎవ్వరినుండియైనా సరే, మంచినే గ్రహించడం నా సహజ వృత్తి స్వభావమూ కాబట్టి ఆ తావు నోరులేని జంతువులు కాని, పక్షులు కాని, చిన్న పుష్పంకాని, ఒక్క రామీయే కాదు. ఈనాటినుండి, రామీ ప్రేమను ముందు ముందు ఎక్కువగా వ్యక్తపరుచుటకు కోరుచుంటిని ఈ దినములలో, రామీ అని ఉచ్చరించగానే, నా పిలుపుకి సమాధానం వెంటనే అన్నివైపుల నుండి వస్తుంది; ఎందుకంటే రామీ, రాములు ఇరువురు కారు ఒక్కటే.

మనకు గోచరించే వైవిధ్యంలో ఏకత్వం ఒకే రాముని చూడగలిగినవారు ధన్యులు.

రామీ శరీరం విడచెను. రామీ జీవించియుండగా, నేను హెచ్చుగా తోడ్పడలేదన్నవిచారమే మిగిలియున్నది. రామీ ఇప్పుడు మానవజన్మ నెత్తిననుట ఆనందము. రామీ ఆత్మ ఏదో ఒక శరీరంలో ప్రవేశించివున్నది. గాన, అందరినీ ప్రేమించుటయే రామీని ప్రేమించుట.

ప్రేమయే దైవము! దైవమే ప్రేమ!
రాముడు, రామీ రెండుకావు, ఒక్కటే!
రామీ ఆత్మకు, రాముడు, శాంతినిచ్చి బ్రోచుగాక!

నిస్సందేహంగా రాముడు, రామీ ఒక్కటే ఇద్దరు కారు. సృష్టిలోని చైతన్యం, ప్రకాశం, హృదయం ఎవరో, చేతనా చేతనములలో వుండే ఏకైక కాంతి ఎవరో ఆ ఏకనాథుని మౌనంలో ఆరాధిస్తున్నాను.

లోకాస్సమస్తా స్సుఖినోభవంతుః

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

**చిన్ని కానుక**

**మా ప్రేమ ప్రసంగం,రామీకి ఈ చిన్ని కానుక సమర్పిస్తున్నాను. విశ్వాత్మతలో ఆ ఆత్మకు శాశ్వత శాంతి నొసంగమని నా ప్రార్థన. ప్రాక్ పశ్చిమాలలో ఉండే జంతు జాలమంతటికీ నా శుభాకాంక్షలు.**

(శాంతి సెప్టెంబరు 1971)